

ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. కోటి చెక్కును బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డికి అందజేస్తున్న కిమ్స్ హాస్పిటల్ ఎండీ భాస్కర్ రావు

# ఏటా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసినా రాష్ట్రంలో నిరుద్యోగం పోదు

- వచ్చే ఏడాది నుంచి ఇంజినీరింగ్‌లో ఇంటర్న్‌షిప్
- బీటెక్ విద్యార్థులు గంజాయి అమ్ముతున్నారు
- బీఎఫ్ఐఎస్ కోర్సు ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఏటా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసినా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పోదని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తాము 90 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలను భర్తీచేశామని, రెండుమూడు రోజుల్లో మరో 35 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీచేయనున్నట్టు చెప్పారు. త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీని కూడా ఏర్పాటు చేయబోతున్నట్టు చెప్పారు. మాసాబ్‌ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ వర్సిటీ ఆడిటోరియంలో బుధవారం బ్యాకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) కోర్సును సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిశ్రమ అవసరాలను తీర్చడం, ఉద్యోగావకాశాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా బీఎఫ్ఎస్ఐ కోర్సును ప్రారంభించినట్టు తెలిపారు. స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ ఆఫ్ క్యాంపస్‌లను రాష్ట్రంలో ప్రారంభించాలని ఆయా సంస్థలను కోరినట్టు చెప్పారు. వచ్చే ఏడాది నుంచి ఇంజినీరింగ్‌లోనూ ఇంటర్న్‌షిప్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఇంజినీరింగ్ పట్టాలు అందుకుంటున్న లక్షలాది విద్యార్థులకు బేసిక్ నాలెడ్జ్ కూడా ఉండడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. టీచింగ్ స్టాఫ్‌లో సరైన నైపుణ్యాలు లేవని, ఇలా ప్రమాణాలు లేని కాలేజీల గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. బీటెక్ చదివిన వారు కూడా డ్రగ్స్ వలలో చిక్కుకుంటున్నారని ఆం దోళన వ్యక్తం చేశారు. గంజాయి తాగడం నుం చి దానిని విక్రయించే దశకు బీటెక్ విద్యార్థులు చేరుకోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు.

**10 వేలమందికి ఉచితంగా ప్రవేశాలు**

బీఎఫ్ఎస్ఐ కోర్సును రాష్ట్రంలోని 10 వేల మంది ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉచితంగా అందిస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ కోర్సు నిర్వహణకు ఎక్విప్ సంస్థ రూ. 2.5 కోట్లు అందజేసిందని పేర్కొన్నారు. మొదటి 10వేల మందికి ఉచితంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. కోర్సులో చేరిన వారికి డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో ఆరు నెలల పాటు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తామని తెలిపారు.

**మూసీ నిర్వాసితులకు 'డబుల్' ఇండ్లు**

జీహెచ్ఎంసీ పరిధిలో మూసీనది ఒడ్డున, బఫర్ జోన్ పరిధిలో నివసిస్తున్న వారికి గతంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లను కేటాయించనున్నట్టు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో భాగంగా నది ఒడ్డున, బఫర్‌జోన్ పరిధిలో సుమారు 15,000మంది నివసిస్తున్నట్టు గుర్తించారు. వారిని అక్కడి నుంచి తొలగించి డబుల్ బెడ్రూమ్ ఇండ్లలో పునరావాసం కల్పించనున్నట్టు తెలిపారు. తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ, జీహెచ్ఎంసీ కమిషనర్, కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# దసరాకు ఇందిరమ్మ కమిటీలు

- రాజీవ్ స్వగృహ ఇండ్లకు వేలం : సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 25(నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం దసరా పండుగ నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గ్రామ, వార్డు, మండల, పట్టణ, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటుకు విధివిధినాలను ఒకట్రెండు రోజుల్లో రూపొందించాలని సూచించారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు దక్కాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సచివాలయంలో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నుంచి ఇతర రాష్ట్రాలు లక్షల సంఖ్యలో గృహాలు మంజూరు చేయించుకుంటే తెలంగాణ వెనుకబడిందని, ఈ దఫా కేంద్రం మంజూరు చేసే గృహాల్లో గరిష్ఠంగా రాష్ట్రానికి ఇండ్లు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీఎంఏవై కింద రాష్ట్రానికి రావాల్సిన బకాయిలను రాబట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో డాటాను ఎప్ప టికప్పుడు అప్‌డేట్ చేయాలని చెప్పారు. పెద్ద సంఖ్యలో ఇండ్ల నిర్మాణం ప్రారంభిస్తే ఇంజినీరింగ్ సిబ్బంది సమస్య ఎదురయ్యే పరిస్థితి ఉంటుందని అధికారులు తెలపగా అవసరమైతే ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియామకాలు చేపట్టాలని సూచించారు. రాజీవ్ స్వగృహలో నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లు, ఇండ్లను వేలం వేయాలని తెలిపారు. డబుల్ బెడ్రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా ఎందుకు అప్పగించ లేదని ప్రశ్నించారు. వెంటనే అర్హులకు ఇండ్లను అప్పగించాలని చెప్పారు. హైదరాబాద్ నగరంలో నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లకు మౌలిక వసతులు కల్పించి, అర్హులైనవారికి అప్పగించాలని సూచించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎం ప్రిన్సిపల్ కార్యదర్శి వీ శేషాద్రి, సీఎం కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాశ్, తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతమ్ పాల్గొన్నారు.

# '317'పై కసరత్తు పూర్తి?

- సీఎం రేవంత్ రెడ్డి దగ్గరికి చేరిన ఫైల్
- రెండుమూడు రోజుల్లో ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): జీవో-317 ప్రభావిత ఉద్యోగులకు సంబంధించి ప్రభుత్వం తుది నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తున్నది. ఈ అంశంపై మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలోని క్యాబినెట్ సబ్ కమిటీ కసరత్తు పూర్తి చేసింది. నివేదికను రూపొందించి, మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి దగ్గరికి పంపినట్టు సచివాలయ వర్గాలు తెలిపాయి. మంగళవారం సబ్ కమిటీ సీఎంతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారని పేర్కొన్నాయి. నివేదికను సీఎం ఆమోదిస్తే రెండుమూడు రోజుల్లో ప్రకటన వెలువడే అవకాశం ఉన్నదని పేర్కొన్నాయి. జీవో 317, జీవో 46పై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఫిబ్రవరిలో మంత్రి దామోదర అధ్యక్షతన మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌తో సబ్ కమిటీని నియమించింది. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నుంచి అభిప్రాయాలను సేకరించారు. స్థానికత, భార్యాభర్తలు (స్పౌజ్), మెడికల్, మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించిన కమిటీ.. సానుకూలంగా నిర్ణయం తీసుకున్నది. స్పౌజ్, మెడికల్, మ్యూచువల్ బదిలీలకు పచ్చజెండా ఊపిందని తెలిసింది. వారి బదిలీలకు సంబంధించి ఒకటి రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నాయి. ఇక స్థానికతపై ఏం చేయాలనేదానిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని సమాచారం. దీనిపై మరింత అధ్యయనం అవసరమని కమిటీ భావిస్తున్నట్టు తెలిసింది.

# తెలంగాణ అభివృద్ధిలో భాగం కావాలి

- అమెరికన్ కంపెనీలకు భట్టి పిలుపు
- లాస్‌వేగాస్ మైన్‌ఎక్స్‌పో సందర్శన

హైదరాబాద్, సెప్టెంబర్25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో, ఫోర్త్ సిటీ నిర్మాణంలో అమెరికన్ పరిశ్రమలు, వ్యాపార సంస్థలు భాగస్వామ్యం పంచుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క కోరారు. అమెరికాలోని లాస్‌వేగాస్‌లో మంగళవారం ప్రారంభమైన అంతర్జాతీయ మైన్స్ ఎక్స్‌పో-2024లో పాల్గొన్న ఆయన అనంతరం పలు అమెరికన్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపనకు, పెట్టుబడులకు, వ్యాపారాలకు హైదరాబాద్ అత్యంత అనువైన ప్రాంతమని, తెలంగాణలో ఖనిజ పరిశ్రమాభివృద్ధికి దోహదపడాలని, అందుకు అవసరమైన అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. ఈ ఎక్స్‌పోలో 1900 యంత్ర ఉత్పత్తి సంస్థలు స్టాల్స్ ఏర్పాటు చేశాయి. 121 దేశాల నుంచి 44 వేల మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

# దళితబంధు నిధులు విడుదల చేయండి

- మంత్రి పొన్నంకు లబ్ధిదారుల డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్25 (నమస్తే తెలంగాణ): దళితబంధు నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని దళితబంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోగిల మహేశ్, రాష్ట్ర కన్వీనర్ చిట్టి మల్ల సమ్మయ్య డిమాండ్ చేశారు. సచివాలయంలో బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రెండో విడత దళితబంధు నిధులు విడుదలైనా కలెక్టర్ల అకౌంట్లలోనే ఉన్నాయని వెల్లడించారు. నిధుల విడుదలకు 9 నెలలుగా అనేక కార్యక్రమాలు చేపట్టినా ఎలాంటి స్పందన లేదని వాపోయారు. ఇప్పటికైనా నిధుల విడుదలకు చొరవ చూపాలని పొన్నంను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కో ఆర్డినేటర్ మడికొండ రమేశ్, ఉపాధ్యక్షుడు బోనగిరి శ్రీనివాస్, సలహాదారులు దర్శనాల సంజీవ, కావేరి చిన్నికృష్ణ, బాల నర్సు, కమిటీ నేతలు కొలుగూరి సురేశ్, నరేశ్, భిక్షపతి, కుమార్, శ్రీనివాస్, రాజేశ్, మధు, దేవదాసు, రజనీకాంత్ ఉన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళితబంధు సాధన సమితి నేతలు

**ఆదాయాన్ని పెంచడంపై దృష్టి పెట్టాలి**

విద్యార్థులకు పాఠశాలలు, కళాశాలల స్థాయిలోనే ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేలా కరికులం ఉండేలా చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో రోడ్డు-భద్రత, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రవాణా శాఖ ఆదాయం పెంచడానికి తీసుకోవల్సిన చర్యలపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన సూచనలపై చర్చించారు. స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై విషయంలో కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఆటోలలో విద్యార్థులను ఓవర్ లోడ్‌తో తీసుకెళ్తున్న వారిపై తనిఖీలు నిర్వహించాలని సూచించారు. తెలంగాణలో ప్రతి రోజూ 20 మంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని నివారించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

## నిబంధనల మేరకే కాళేశ్వరం బిల్లుల చెల్లింపు

- జస్టిస్ ఘోష్ కమిషన్ ఎదుట కార్పొరేషన్ అధికారులు

హైదరాబాద్, సెప్టెంబర్25 (నమస్తే తెలంగాణ): రుణాలు, బిల్లుల చెల్లింపు మొత్తం కూడా నిబంధనల మేరకే కొనసాగిందని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు కాళేశ్వరం కార్పొరేషన్ అధికారులు నివేదించారు. కమిషన్ బుధవారం నిర్వహించిన బహిరంగ విచారణకు కాళేశ్వరం కార్పొరేషన్, జనరల్ అకౌంట్స్ అధికారులైన వెంకట అప్పారావు, పద్మావతి, మణిభూషన్ శర్మ హాజరయ్యారు. కాళేశ్వరం నిర్మాణానికి నిధుల సేకరణ, బిల్లుల చెల్లింపులు, కార్పొరేషన్ ఆదాయ, వ్యయాలు, కాగ్ నివేదికలోని పలు అంశాలపై వారిని కమిషన్ ప్రశ్నించింది. ప్రాజెక్టు పూర్తయితే అవి కార్పొరేషన్‌కు ఆస్తులుగా బదలాయిస్తారని అధికారులు వెల్లడించారు. గురువారం కూడా కమిషన్ విచారణ కొనసాగనున్నది.

# బీసీ ఉద్యమ బలోపేతానికే రాజీనామా

- రాజకీయ పార్టీ ఏర్పాటుపై త్వరలో నిర్ణయం
- జాట్ల తరహాలో తెలంగాణలో బీసీల ఉద్యమం
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య
- కాంగ్రెస్‌లోకి ఆహ్వానించిన మల్లు రవి, తీన్మార్ మల్లన్న



బీసీ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, సెప్టెంబర్25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర రాజకీయాలకు అతీతంగా బీసీల ఉద్యమం బలోపేతానికే రాజ్యసభ సభ్యత్వానికి తాను రాజీనామా చేశానని బీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య వెల్లడించారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల తరఫున చట్టసభల్లో ప్రశ్నించినా సమాధానం రావడం లేదని, దీంతో ప్రజా ఉద్యమమే శరణ్యమని భావించి ఇంకా నాలుగేండ్ల గడువున్నా రాజీనామా చేశానని తెలిపారు. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల సాధనే తన జీవిత ధ్యేయమని, ఆ దిశగా పోరాటాలను ఉధృతం చేస్తానని చెప్పారు. రాజకీయ పార్టీ పెట్టాలని బీసీ బిడ్డల నుంచి వస్తున్న ఒత్తిడిపై కూలంకషంగా చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. ఈ పోరాటాల్లోకి రాజకీయాలకతీతంగా బీసీలంతా కదలిరావాలని కోరారు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన ఆర్ కృష్ణయ్యతో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి బుధవారం ఉదయం భేటీ అయ్యారు. కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఆహ్వానించారు. ఆ తర్వాత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సైతం ఆర్ కృష్ణయ్యను కలిసి ఇదే విషయమై చర్చలు జరిపారు. సమావేశంలో బీసీ సంఘాల నేతల గుజ్జ కృష్ణ, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ వర్గాలన్నీ ఏకతాటిపైకి రావాలి

- కులగణన, రిజర్వేషన్లు పెంచేవరకు వదిలేది లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలి
- మాజీ ఎంపీ కృష్ణయ్య, బీఆర్ఎస్ నేత ఎల్ రమణ



ఖైరతాబాద్, సెప్టెంబర్ 25: కులగణన, బీసీ రిజర్వేషన్ల పెంపు సాధనే ఎజెండాగా పెట్టుకొని బీసీల్లోని అన్నివర్గాలు ఏకతాటిపైకి రావాలని మాజీ ఎంపీ కృష్ణయ్య, బీఆర్ఎస్ నేత ఎల్ రమణ పిలుపునిచ్చారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం బీసీ జాతీయ సంక్షేమ సంఘం, కొండా లక్ష్మణ్ బాపూజీ ఫౌండషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'సమగ్ర కులగణన-సామాజిక న్యాయం' అన్న అంశంపై జరిగిన అఖిలపక్ష సమావేశంలో వారు మాట్లాడారు. సమగ్ర కులగణన, రిజర్వేషన్లు అమలు చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదలిపెట్టేది లేదని, ప్రభుత్వం వెంటనే స్పష్టమైన విధానం ప్రకటించాలని కోరారు. కేవలం బీసీ గణన జరిపి చేతులు దులుపుకోవాలని చూస్తున్నదని, కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే సమగ్ర కులగణన చేసి, రిజర్వేషన్లు పెంచాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఓ వైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా కులగణన చేయాలని కోరుతుంటుంటే, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. సమావేశంలో బీసీ జాతీయ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, సెక్రటరీ జనరల్ రాపోలు జ్ఞానేశ్వర్, ఎర్ర సత్యనారాయణ, లాల్‌కృష్ణ, కేవీ రావు, రవి కుమార్, నరసింహ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 'పాలమూరు'ను ఎండబెట్టారు.. కాళేశ్వరాన్ని పండబెట్టారు

- మంత్రులు ప్రాజెక్టులను సందర్శించడంపై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం




వనపర్తి, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ సర్కార్ ఉమ్మడి పాలమూరులోని సాగునీటి ప్రాజెక్టులను ఎండబెట్టి.. కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిగా పండబెట్టిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు పలు ప్రాజెక్టులను పరిశీలించడంపై స్పందించారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరు ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టి ఆంధ్రా, రాయలసీమ ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేసింది కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల కింద కనీసం 4 టీఎంసీల రిజర్వాయర్లను కూడా ఏర్పాటు చేయకుండా, ఆంధ్రాలో మాత్రం 400 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లను నిర్మించింది కాంగ్రెస్ కాదా? అని ప్ర శ్నించారు. కేసీఆర్ తలపెట్టిన పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకుంటూ వందలాది కేసులు వేయించిన కాం గ్రెస్, ఇటీవలే వట్టెం పంప్‌హౌస్‌ను నిర్లక్ష్యంతో ముంచిందని విమర్శించారు. నెల రోజులైనా నీటి ని ఎత్తిపోయలేదని, పాలమూరు జిల్లాపై ఉన్న నిర్లక్ష్యానికి ఇదే నిదర్శమని అన్నారు. పది నెలల నుంచి పాలమూరు ప్రాజెక్టుల వైపు మంత్రులు కన్నెత్తి చూడలేదని ఆరోపించారు. ఉదండాపూర్ నుంచి గ్రావిటీతో కొడంగల్, నారాయణపేటకు నీళ్లిచ్చే అవకాశం ఉన్నా భేషజాలకు పోయి సీఎం రేవంత్‌రెడ్డి 6 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న జూరాలపై అదనపు భారం మోపుతున్నారని పేర్కొన్నా రు. మంత్రుల పర్యటనతో పాలమూరుకు ఒరిగేది ఏమీలేదని, బీఆర్ఎస్ ప్రశ్నలకు భయపడి హడావిడిగా ఏ ప్రణాళికలు లేకుండానే పర్యటన పెట్టుకున్నారని విమర్శించారు. ట్రయల్ రన్ పూర్తయిన పంపుల ద్వారా నార్లాపూర్, ఏదుల రిజర్వాయర్లను నీటితో నింపాలని, విద్యుత్తు కనెక్షన్లకు సంబంధించిన పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

## సీఎంతో బీసీ కమిషన్ చైర్మన్ భేటీ

హైదరాబాద్, సెప్టెంబర్25 (నమస్తే తెలంగాణ): పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, కమిషన్ సభ్యులు బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. రాష్ట్రంలో బీసీ కులగణనకు అనుసరించాల్సిన విధి విధానాలపై చర్చించారు. బీసీ కులగణన ప్రక్రియకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని, ఇతర రాష్ట్రాల్లోని విధానాలను తెలుసుకోవాలని కమిషన్‌కు సీఎం సూచించారు. వెంటనే బీసీ కులగణనకు కార్యాచరణ ప్రారంభించాలని ఆదేశించారు.

# మంత్రులను కలవనియ్యరా?

- ఎంపీ, ఎమ్మెల్యేతో భూనిర్వాసితుల వాగ్వాదం
- ఒకే రిజర్వాయర్‌కు రెండు ప్యాకేజీలా?
- పరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్
- లేదంటే పనులను అడ్డుకుంటామని హెచ్చరిక



ఉదండాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్, జూపల్లి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు, చిన్నారెడ్డి



ఉదండాపూర్ రిజర్వాయర్ వద్ద నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవితో వాగ్వాదానికి దిగిన భూనిర్వాసితులు

జడ్చర్ల, సెప్టెంబర్ 25 : మంత్రులు, ఎమ్మెల్యేలకు నిరసన సెగ తగిలింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఉదండాపూర్ వద్ద పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులను పరిశీలించేందుకు బుధవారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వచ్చారు. మంత్రులను కలిసేందుకు అనుమతించకపోవడంతో ఉదండాపూర్ భూనిర్వాసితులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వారి వద్దకు ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రావడంతో భూనిర్వాసితులు వాగ్వాదానికి దిగారు. మంత్రులకు తమగోడు వినిపిస్తామంటే ఎందుకు వెళ్లనివ్వడం లేదని నిలదీశారు. రైతు ప్రభుత్వమని చెప్పే కాంగ్రెస్.. కర్షకులను అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. పది రోజుల కిందట పునరావాసం కింద పరిహారం పెంచి ఒక్కొక్కరికి రూ.25 లక్షలు ఇస్తామని చెప్పిన ఎమ్మెల్యే.. ఇప్పుడు మాట మార్చి రూ.16 లక్షలు మాత్రమే ఖాతాల్లో వేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పరిహారం పెంచకపోతే పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఒకే రిజర్వాయర్‌లో రెండు రకాల ప్యాకేజీలు ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. పోలేపల్లి శివా రు రైతులకు ఎకరాకు రూ.12.50 లక్షలు ఇచ్చారని, అదే శివారుకు ఇవతల ఉన్న భూములకు రూ.5.50 లక్షలు మాత్రమే ఎలా ఇస్తారని నిలదీశారు. తమకు కూడా పోలేపల్లి రైతులకు ఇచ్చిన విధంగా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**న్యాయపరంగా పునరావాసం : ఉత్తమ్**

ఉదండాపూర్ రిజర్వాయర్ కింద ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి రూ.45 కోట్లను విడుదల చేసినట్టు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఉదండాపూర్‌తోపాటు ఇతర రిజర్వాయర్లలో ముంపునకు గురైన నిర్వాసితులకు న్యాయపరంగా పునరావాసం కల్పిస్తామని చెప్పారు.

## 'వట్టెం' చూడకుండానే వెనుదిరిగిన మంత్రి

- పంప్‌హౌస్ పరిశీలనకు మంత్రి ఉత్తమ్
- హెలికాప్టర్‌కు సమయం లేదని వెనక్కి
- సమీక్ష లేకుండానే హైదరాబాద్‌కు

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఆర్భాటంగా వెళ్లిన మంత్రి ఉత్తమ్, కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం అది పూర్తిచేయకుండానే వెనక్కి వచ్చింది. హెలికాప్టర్ టేకాఫ్‌కు టైం అయిపోతున్నదని చెప్పి ప్రాజెక్టులపై ఎలాంటి సమీక్ష లేకుండానే, వట్టెం రిజర్వాయర్‌ను పరిశీలించకుండానే వెనుదిరగడం చర్చనీయాంశమైంది. భారీ వర్షాలకు నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీపురం శివారులోని నాగనూలు చెరువు, కుమ్మెర చెరువులు ఉప్పొంగడంతో ఆ బ్యాక్ వాటర్ కారణంగా వట్టెం పంప్‌హౌస్ నీటిమునిగింది. 16 కిలోమీటర్ల పొడవు, 9 మీటర్ల వ్యాసంతో ఉన్న 2 సొరంగాలు పూర్తిగా నీటితో నిండిపోయా యి. పంప్‌హౌస్ సైతం మునిగిపోయింది. మొత్తంగా 34 లక్షల క్యూబిక్‌మీటర్ల నీరు చేరిందని అధికారులు ప్రాథమికంగా అం చనా వేశారు. నీటి తోడివేత పనులు ఇప్పటికీ మందకొడిగా కొనసాగుతుండడంపై బీఆర్ఎస్ నేతలు, స్థానికుల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును మంత్రి ఉత్తమ్ బృందం సందర్శించింది.

## ఇంజినీరింగ్ విద్యార్థులకు సీఎం క్షమాపణ చెప్పాలి

- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ విద్యార్థులు గంజాయికి అలవాటు పడుతున్నారని వాళ్లకు కనీసం జ్ఞానం ఉండటం లేదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొనటాన్ని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఖండించారు. కొంతమంది విద్యార్థులు వారి వ్యక్తిగత బలహీనతలు, పరిస్థితుల ప్రభావం, చెడు సావాసాల వల్ల తప్పుదారి పడితే మొత్తం విద్యార్థులనే నిందించటం సీఎం అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిఘా వ్యవస్థ పూర్తిగా విఫలమైందని స్వయంగా సీఎమ్మే అంగీకరిస్తున్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని ఇంజినీరింగ్ విద్యార్థులకు, ఐటీ ఉద్యోగులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

- మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 25(నమస్తే తెలంగాణ): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అలంపూర్‌లోని శ్రీ జోగులాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి దేవస్థానంలో అక్టోబర్ 3 నుంచి 12వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకులు ఆనంద్‌శర్మ బుధవారం మంత్రి సురేఖను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వానపత్రికను అందించారు.

## హైడ్రాకు కొత్తగా 169 పోస్టులు

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ విపత్తు నిర్వహణ-ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ సంస్థ(హైడ్రా)కు 169 మంది సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా కేటాయించింది. ఈ పోస్టులను వివిధ విభాగాల్లో డిప్యూటేషన్ ప్రాతిపదికన భర్తీ చేయడానికి మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌కు అనుమతిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నలుగురు అదనపు కమిషనర్లు, ఐదుగురు డీసీపీలు, 16 మంది సీఐలు, 16 మంది ఎస్ఐలు, 60 మంది పోలీస్‌కానిస్టేబుళ్లు, 12 మంది స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు, 10 మంది అసిస్టెంట్ ఇంజినీర్లతో పాటు మొత్తం 169 పోస్టులు హైడ్రాకు కేటాయించాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు.

## గురుకులాలకు సొంత భవనాలు నిర్మించండి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి వినతి

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ గురుకుల విద్యా సంస్థలలో సొంత భవనాలు నిర్మించి, వసతి సౌకర్యాలు మెరుగుపరుచాలని సీఎస్ శాంతికుమారికి టీఎస్ యూటీఎఫ్, గురుకులాల సంఘాల జేఏసీ తరపున ఎమ్మెల్సీ నర్సిరెడ్డి బుధవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఐదు రకాల సొసైటీల పరిధిలో 1022 గురుకులాలు కొనసాగుతున్నాయని, వాటిలో 700 గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు.

## సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులివ్వాలి

- బీజేపీ ఎంపీ ఈటల డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): సర్పంచ్‌లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అడ్డదారులు తొక్కి అధికారంలోకి వచ్చిందని, పాలనలో విఫలమైందని ధ్వజమెత్తారు. సర్పంచ్‌లు దవాఖానల్లో ఉండి, డబ్బులు లేక ఏడుస్తున్నారని పేర్కొంటూ.. బాకీ ఉన్న నిధులన్నీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ఆందోల్ నియోజకవర్గంలో 48 చెరువుల అభివృద్ధి

హైదరాబాద్, సెప్టెంబర్25 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గంలోని 48 చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.10.18కోట్లతో పరిపాలన అనుమతులను మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పుల్కల్‌లో 23 చెరువుల అభివృద్ధికి రూ.4.96 కోట్లు, చౌటుకూర్‌లో 25 చెరువుల అభివృద్ధికి రూ.5.21 కోట్లను మంజూరు చేసింది.